క్లుప్తంగా

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



బహుమతులు ప్రదానం చేస్తున్న వెంకటకృష్ణారెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు శాఖా గ్రంథాలయాలలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా శాఖల గ్రంథాలయాధికారులు వెంకటకృష్ణారెడ్డి, నాయక్ మాట్లాడుతూ గత నెల 8 నుంచి ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన కేంద్రాల్లో ఆయా గ్రంథాలయాల పరిధిలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు తెలిపారు.

ప్రవేశ పరీక్షకు 46 మంది హాజరు

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నిర్వహించిన పరీక్షకు 46 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశాలకు 70 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 24 మంది గైర్హాజరయ్యారన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు ప్రతిరోజు ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రజాశక్తి కార్యాలయం ఎదురుగా ఉన్న పార్క్ ఆవరణంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మహబూబ్‌బాషా హాజరై ప్రశంసా పత్రాలు, అందజేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు లలిత కీర్తన, రోహిత్, షబ్బీర్, నరసింహ, కపిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది గైర్హాజర్

కోడుమూరు రూరల్: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం 148 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 139 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



పత్తి విత్తనాలు విత్తేందుకు సాళ్లు వేస్తున్న రైతన్న

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రెండు రోజుల నుంచి మండలంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సీజన్ ప్రారంభంలోనే వర్షం కురవడంతో మండలంలోని కోడుమూరు, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అమడగుంట్ల, అనుగొండ, పులకుర్తి, క్రిష్టాపురం గ్రామాల్లో రైతులు ఖరీఫ్ కింద పత్తి, కొర్ర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లోనూ మరో వర్షం పడితే పంటలను సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొణిదేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి ఆదివారం బైక్‌పై పాణ్యంకు బయలుదేరారు. కారు యూటర్న్ చేసుకునే సమయంలో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు గాయపడటంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్పందనకు హాజరు కావాలి

గూడూరు: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ అంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గైర్హాజరైన అధికారులపై చర్యలుంటాయన్నారు.

ఎల్లమ్మా..సమస్యలు కనవమ్మా!

- అభివృద్ధికి నోచుకోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం
- కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందుల
- ఆలయ పరిసరాల్లో దుర్గంధం
- దాతలు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ నిరుపయోగం

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం సమస్యలకు నిలయంగా మారింది. ప్రతి మంగళవారం జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల నుంచి కానుకల రూపంలో ఆదాయం భారీగా సమకూరుతున్నా.. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పట్టించుకోవడంలేదు. కనీసం దాతలు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ కూడా ఉపయోగంలో లేకపోవడంతో భక్తులు దాహం తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక ఆలయ పరిసరాలు దుర్గంధ భరితంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు.

మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్

భక్తుల సౌకర్యార్థం గతంలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ రూ.5 లక్షలు వెచ్చించి వాటర్‌ప్లాంట్ గదితో పాటు మరో రూ.5 లక్షలు ఖర్చు చేసి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. అయితే దాని నిర్వహణను గాలికొదిలేయడంతో కొంతకాలానికే నిరుపయోగంగా మారింది. సామర్థ్యం తక్కువ ఉన్న మోటార్ బిగించడం



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం పక్కనే కంపుకొడుతున్న మురుగునీరు

కూడా ట్యాంక్ నిరుపయోగంగా మారడానికి కారణంగా తెలుస్తోంది. ఇక భక్తులు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకని బుధవారపేటకు చెందిన సరస్వతమ్మ, లక్ష్మన్న కుమారులు బి మధుసూదన్‌నాయుడు, రుక్మిణమ్మ, కృష్ణమూర్తి కుమారుడు వినయ్ బోరు వేయించి, ట్యాంకు నిర్మాణం చేయించారు. అయితే వృథా నీరు వెళ్లడానికి చిన్నపాటి మురుగు కాలువ కూడా తీయించకపోవడంతో ఆలయ పరిసరాల్లోనే నిల్వవుండి అపరిశుభ్రంగా మారాయి. కాలువ తీసి సమస్యను పరిష్కరించాల్సిన ఆలయ అధికారులు కుళాయిలకు నీటి సరఫరాను నిలిపేసి చేతులు దులుపుకున్నారు.

నిధుల మంజూరుకు రెండేళ్లు

ఆలయ పరిసరాల్లో మురుగు కాలువ నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.7 లక్షలు మంజూరయ్యాయి. పనుల కాంట్రాక్ట్‌ను కర్నూలుకు చెందిన ముక్తా కన్‌స్ట్రక్షన్స్ నవీన్ దక్కించుకున్నారు. అయితే అతడు ఇప్పటికి కూడా పనులు ప్రారంభించకపోయినా అధి



మూతపడిన దాతల సహకారంతో నిర్మించిన మంచినీటి కొళాయిలు

కారులు పట్టించుకోవడంతోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా దేవదాయధర్మదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు మరుగుదొడ్ల సమస్య

జిల్లా నలుమూలల నుంచి వెంకాయపల్లె ఎల్లమ్మ తల్లి దర్శనానికి వచ్చిన మహిళా భక్తులకు మరుగుదొడ్లు, టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులకు



నీళ్లులేక మూతపడిన దాతలు నిర్మించిన మంచినీటి ట్యాంకు

గురవుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించి భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎల్లమ్మతల్లి దర్శనానికి వచ్చిన భక్తులకు ముఖం, కాళ్లు శుభ్రం చేసుకునేందుకు సైతం నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో నెలకొన్న సమస్యలపై ఈఓ సీతారామిరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. ఆయన స్పందించడం లేదు.

కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు (న్యూటౌన్): స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలకు కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపుతామన్నారు. అలాగే మండల పరిధిలోని ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం డ్యా అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యాయమైన పరిహారం ఇవ్వాలి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో నిర్మిస్తున్న సోలార్ పరిశ్రమకు భూములు తీసుకుంటున్న విషయంలో తమకు సరైన పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. ఆదివారం తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డిలు రైతుపొలం వద్దకు చేరుకుని రైతుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు

కర్నూలు: నగరంలోని బుధవారపేట అభయారణ్య స్వామి దేవాలయం పక్కన నివాసం ఉంటున్న ఉరుకుందు, వీణా దంపతుల కుమార్తెలు మంజూషా (6) శాలినీ (5) ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి వెంటనే స్పందించి ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో అమ్మాయిల ఫొటోలను పంపించి గంట వ్యవధిలోనే ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. చిన్నారులు కొండారెడ్డి బురుజు నుంచి పాతబస్టాండ్ వైపుకు వెళుతుండగా పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో ఉన్న ఫొటోలను గుర్తించి స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న పోలీసులకు అప్పగించారు. డీపీఓ నుంచి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి పిల్లలను అదుపులోకి స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు.



తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

క్రీడల్లో రాణించాలి

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఉషా సంఘం చైర్మన్ డాక్టర్ శంకరశర్మ సూచించారు. నగరంలోని పెద్ద మార్కెట్ బాలికల పాఠశాలలో ఆదివారం ఉషా క్రీడా వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకరశర్మ మాట్లడుతూ ప్రతి రోజు ఆటలు ఆడడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బ్యాగులు, ప్రశంసా పత్రాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాసులు, అముతేశ్వర్, చిరంజీవి, క్రాంతికుమార్, చిన్న శ్రీనివాసులు పాల్గొన్నారు.



విద్యార్థులు బ్యాగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర శర్మ

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాతంగా ముగిసిందని ఎంఈఓ కోటయ్య తెలిపారు. 77 మంది దరఖాస్తు చేసుకోగా 66 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

మోగనున్న బడి గంట

- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- మౌలిక వసతులు ఏర్పాటు చేసిన అధికారులు

గూడూరు: నేటి నుంచి బడి గంటలు మోగనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు ఇక బడి బాట పట్టనున్నారు. ఇంకా వేసవి గాలులు, వేడి తీవ్రత తగ్గక పోవడంతో ఈ నెల 17వ తేదీ వరకు ఒంటి పూట బడులు కొనసాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి సునీలమ్మ ఆదివారం తెలిపారు. కాగా పాఠశాలలు తెరిగే మొదటి రోజు సోమవారం ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తామన్నారు.

– పాణ్యం: వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి.



పాణ్యం: కొండ జుటూరు పాఠశాలలో జేవీకే కిట్లు అందుకుంటున్న హెచ్ఎం అన్వర్‌బాషా

మండలంలో పలువురు హెచ్ఎంలు ఆదివారం తమ పాఠశాలలకు చేరుకుని వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందించాల్సిన జేవీకే కిట్లను సరి చూసుకున్నారు. కొందరు హెచ్ఎంలు తమ పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు జేవీకే కిట్లను ఎమ్మార్సీ నుంచి తెచ్చి స్కూల్‌లో భద్రపరిచారు.

– కోడుమూరు రూరల్: పాఠశాలలు సోమవారం పునఃప్రారంహించనున్నట్లు ఎంఈఓ అనంతయ్య ఆదివారం తెలిపారు. ఎండలు తగ్గనందున ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకు ఒంటి పూట బడులనే కొనసాగిస్తామన్నారు. మండలంలోని 10,286 మంది విద్యార్థులకు సోమవారం నుంచి జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

కర్నూలు(సెంట్రల్): తూకాల్లో మోసాలకు పాల్పడినా..నాన్ స్టాండర్డ్ వెయిట్స్‌ను వాడినా కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు వ్యాపారులను హెచ్చరించారు. తూకాల్లో జరుగుతున్న మోసాలపై 'కొలత తప్పుతోంది' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాయింట్ కంట్రోలర్ ఎం.గోపికృష్ణారెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, ఇన్‌స్పెక్టర్ ఎం.పరమేశ్వరకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగరంలోని సీక్యాంపు రైతుబజార్ చుట్టూ ఉన్న పలు పండ్లు, కూరగాయల వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒక ఫ్రూట్ షాపులో 100 గ్రాముల బరువు తక్కువగా ఉండడంతో కేసు నమోదు చేశారు. ముద్రలేని..నాన్ స్టాండర్డ్ వెయిట్స్ వాడుతున్న మరో 3 షాపులపై కేసులు నమోదు చేసి రూ.6,400 అపరాధ రుసుం విధించినట్లు శ్రీరాముడు తెలిపారు.



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

తెలుగు సినీ రంగంలో ఆణిముత్యం సినారే



సినారే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో, సినిమా రంగంలో సి.నారాయణరెడ్డి తన దైన శైలితో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో సినారే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభ్యుదయ కవిగా సినారేకు లలిత సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం శ్రీనివాసులు బృందం సినారే పాటల సంగీత విభావరి నిర్వహించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సీవీ రెడ్డి, గాయకులు సుధారాణి, నాగేషన్న తదితరులు పాల్గొన్నారు.

ప్యాలకుర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విజేతలతో ఎంఈఓ, గ్రంథాలయ అధికారి

పాణ్యం: గత నెల 8వ తేదీన ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ కోటయ్య హాజరై మాట్లాడారు. సాంస్కృతి కార్యక్రమాలు, నృత్యాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అదించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జ్ఞాపక'శక్తి' పోతోంది

- పెరుగుతున్న మతిమరుపు జబ్బు
- ఐదేళ్లలో ఐదు శాతం పెరిగిన బాధితులు
- జిల్లాలో 10 శాతం దాకా బాధితులు
- మానసిక ఒత్తిడి, ఆందోళనలే కారణం
- స్మార్ట్ ఫోన్లు అతివాడకం కూడా కారణం
- చిన్నచిన్న విషయాలు మర్చిపోతున్న వైనం

• కర్నూలు నగరంలోని పాతబస్టాండ్‌కు చెందిన చంద్రశేఖర్ ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ తాను ఎవరిని కలవాలి, ఎవరికి ఫోన్ చేయాలి వంటి విషయాలన్నీ బాగా గుర్తుండేవి. ఒకప్పుడు ఫలానా వ్యక్తి ఫోన్ నంబర్ ఎంత అని అడిగితే సెల్‌ఫోన్ చూడకుండానే టకీమని చెప్పేవాడు. ఇలా దాదాపు ఐదారు వందలకు పైగా ఫోన్ నంబర్లు అతని మెదడులో నిక్షిప్తమై ఉండేవి. స్మార్ట్‌ఫోన్‌పై ఎక్కువగా ఆధారపడ్డాక ఇప్పుడు ఇంటి ఫోన్ నంబర్ చెప్పాలన్నా ఫోన్ చూడక తప్పడం లేదు.

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా వృద్ధాప్యంలో మతిమరుపు వస్తుంది. దానిని వైద్యపరిభాషలో అల్జీమర్స్ అంటారు. 60 నుంచి ప్రతి పదేళ్లకు ఒక స్టేజి మారుతూ తీవ్రత పెరుగుతుంది. ఇది వృద్ధుల్లో 10 నుంచి 20 శాతం మందికి ఉండే సమస్య. కానీ ఇటీవల యువతలోనూ మతిమరుపు సమస్య వస్తోంది. చదువుతో పాటు ఉద్యోగంలో తీవ్ర మానసిక ఒత్తిడి, మానసిక ఆందోళన పనిపై ఏకాగ్రత్తను దెబ్బతీస్తోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్ వచ్చాక మెదడులో ఉన్న జ్ఞాపక'శక్తి' కోల్పోతోంది. ఈ క్రమంలో పూర్వంలాగా మెదడుకు మళ్లీ వ్యాయామం చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మతిమరుపు సమస్యతో 10 శాతం వరకు సాధారణ ప్రజలు బాధపడుతున్నారు. ఇందులో వృద్ధుల శాతం 15 నుంచి 20 శాతం వరకు ఉంటోంది. కర్నూలు నగరంలోని మానసిక వైద్యులు, న్యూరాలజిస్టుల వద్దకు వివిధ రకాల సమస్యలతో వస్తున్న వారిలో ప్రధానంగా



జ్ఞాపకశక్తి సమస్య కూడా ఉంటోంది. ఆయా వ్యాధి లక్షణాలతో పాటు తమకు ఈ మధ్య సరిగ్గా గుర్తుండటం లేదని వైద్యులకు రోగులు చెబుతున్నారు. కోవిడ్-19 పరిస్థితుల్లో తీసుకున్న మందులు, వైరస్ కారకాల కారణంగా జ్ఞాపకశక్తి మరింత తగ్గిపోయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సొంతంగా ఆలోచించడం మానేశారు

ఏదైనా పదానికి అర్థం తెలియాలంటే తెలిసిన వారిని, పెద్దలనో అడిగే వారు. లేదా డిక్షనరీ, తెలుగు నిఘంటువులలో వెతికేవారు. కానీ ఇప్పుడు ఏ చిన్న పదం తెలియకపోయినా వెంటనే సెల్‌ఫోన్‌లోని గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే ఏదైనా లెక్క చెబితే పెన్ను పేపర్ తీసుకుని సాధన చేసి సమస్య పరిష్కరించేవారు. కానీ ఇప్పుడు వెంటనే కాలుక్యులేటర్‌ను ఉపయోగిస్తున్నారు. ఏ పదానికి అర్థం కావాలన్నా, ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా, ఏదైనా ఒక విషయం గురించి తెలుసుకోవాలన్నా వెంటనే గూగుల్‌లో వెతికితే క్షణాల్లో సమాధానం లభిస్తోంది. ఇక దీనివల్ల సమయం ఆదా అవుతున్నా ఆలోచించే గుణం లోపిస్తోంది. కాగా ఇటీవల చాట్-జీపీటీ వచ్చిన తర్వాత సమాధానాలే అందులో వస్తున్నాయి. ఇది మనిషి మెదడును పూర్తిగా తినేస్తుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

మతిమరుపునకు కారణాలు

పది మంది కలిసి మనసు విప్పి మాట్లాడుకోకపోవడం, గుంబనంగా ఉండటం, వ్యక్తులకు దూరంగా ఉండటం, ప్రతి విషయానికీ సోషల్ మీడియాపై ఆధారపడటం, ఏ పని చేయాలన్నా ఆందోళన చెందడం, హడావుడి పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురికావడం వంటి కారణాలతో మతిమరుపు బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు పనిఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థికాంశాలు కూడా మతిమరుపునకు కారణమవుతున్నాయి.

అనుబంధాలు దూరం

స్మార్ట్‌ఫోన్ వినియోగంలోకి వచ్చాక సామాజిక బంధాలూ దూరమవుతున్నాయి. పేరుకు వివాహాది శుభకార్యాల్లో అందరూ కలుస్తున్నా మాట వరసకు పలకరించుకుని ఆ తర్వాత ఎవరి స్మార్ట్‌ఫోన్‌లో వారు బిజీగా ఉండి పోతున్నారు. ఎదురుగా మనిషి మాట్లాడుతున్నా వింటున్నట్లే నటిస్తూ స్మార్ట్‌ఫోన్‌లో బిజీగా గడుపుతుండటం మనం నిత్యం గమనిస్తుంటాము. అలాగే ఎవరి ఇంటికి వెళ్లినా, ఎవ్వరైనా ఇంటికి వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంది. దీనివల్ల మనుషుల మధ్య అనుబంధాలు దూరమవుతున్నాయి. ఒక బస్సుల్లో పేపర్ చదివే ప్రయాణికులు లేరు. 98 శాతం మంది స్మార్ట్‌ఫోన్ చూస్తూ పక్కనున్న వారిని కూడా పలకరించని పరిస్థితి.

మత్తుపదార్థాలతో పెనుముప్పు

మత్తుపదార్థాలను వాడటం వల్ల కూడా మెదడు మొద్దుబారి పోయి మతిమరుపునకు కారణం అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్లు తాగే వారిలో మతిమరుపు సమస్య అధికమవుతోందని వైద్యులు గుర్తించారు. ఇందులో మత్తు కోసం క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రాజోలమ్ వంటి కెమికల్స్ కలుపుతున్నారు. దీన్ని తాగిన వారు త్వరగా మత్తుకు బానిస అవుతున్నారు. దీంతో పాటు చీప్ లిక్కర్, పరిమితికి మించి ఆల్కహాలు తాగేవారు, చైన్‌స్మోకర్లలోనూ మతిమరుపు సమస్య ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

మతిమరుపునకు ఇలా చెక్‌పెట్టొచ్చు

- → పుస్తకపఠనం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
- → నిత్యం కెరీర్ గోల్స్‌ను లక్ష్యంగా ఉంచుకోవాలి. ఇందుకోసం రోజు, వారం, నెలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- → శారీరక వ్యాయామం, మంచి ఆలోచనలు, మంచి ఆహారపు అలవాట్లు, ఇతరులతో మమేకం కావడం, కబుర్లు చెప్పుకోవడం చేయాలి.
- → మెదడుకు పనిచెప్పే చదరంగం, పజిల్స్ పూరించడం, సుడోకో, పదవిన్యాసం, పద వినోదం చేయాలి.
- → యోగా, ధ్యానం చేయాలి.
- → సంగీతం, నృత్యం, చిత్రలేఖనం అభిరుచిగా ఎంచుకోవాలి.

కోవిడ్ తర్వాత పెరిగిన మతిమరుపు



పోస్టు కోవిడ్ తర్వాత మతిమరుపు బాధితుల సంఖ్య బాగా పెరిగింది. గతంతో పోలిస్తే 5 శాతం మంది బాధితులు పెరిగారు. వైరస్ కారణంగా మెదడులో అనేక మార్పులు జరగడం వల్ల ఈ పరిస్థితి సంభవించింది. ప్రస్తుతం 40 ఏళ్లలోపు వారిలోనూ మతిమరుపు సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో పాటు బీపీ, షుగర్ దీర్ఘకాలంగా అదుపులో లేకపోయినా నరాల్లో మార్పులు జరిగి మతిమరుపునకు కారణం అవుతుంది. కాబట్టి ఎప్పుడూ బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి.

– డాక్టర్ కె. నాగిరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

పెద్దల్లో మతిమరుపు పట్ల జాగ్రత్త



అల్జీమర్స్ వయస్సు మీదపడే కొద్దీ సమస్య ఎక్కువవుతుంది. దీనివల్ల వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతుంటారు. దీనికి మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, పొగ, మత్తుపానియాలు తాగడం, తలకు గాయాలు కావడం, జన్యుపరమైన మార్పులు, విటమిన్-బి12, విటమిన్-డి లోపం, థైరాయిడ్ సమస్యలు, నిద్రలేమి కూడా మతిమరుపునకు దోహదం చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచుకోవడం, వ్యాయామం, ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం, మంచి ఆహారపు అలవాట్లుతో నివారించవచ్చు.

– డాక్టర్ ఎం.నాగసురేష్, న్యూరాలజిస్టు, కర్నూలు